


EVENING EDITION

నేటి దినపత్రిక సూర్య

www.suryaa.com

www.suryaa.com

4PM

www.suryaa.com

సోమవారం

08 ఏప్రిల్ 2024

పేజీలు: 02


## ఏపీ 15లోపు ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాలు



ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫలితాలను ఈనెల 15లోపు విడుదల చేసేందుకు ఇంటర్మీడియట్ విద్యా మండలి కసరత్తు చేస్తోంది. జవాబు పత్రాల మూల్యాంకనం, మార్కుల స్కానింగ్‌కు సంబంధించిన ప్రక్రియ ఆదివారంతో ముగిసింది. మూల్యాంకనాన్ని మరోసారి పునఃపరిశీలన చేసేందుకు వారంరోజులు సమయం పట్టనుంది. ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు జరగగా.. ప్రథమ, ద్వితీయ సంవత్సరాల పరీక్షలకు రాష్ట్ర వ్యాప్తంగా 10లక్షలకుపైగా విద్యార్థులు హాజరయ్యారు.

## విశాఖ రైల్వే స్టేషన్‌లో కుంగిన ఫుట్ బ్రిడ్జి



విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో సోమవారం ఉదయం పాదచారుల వంతెన కుంగింది. 3, 4 ప్లాట్‌ఫాంల నుంచి వచ్చే ప్రయాణికులు గేట్ నంబర్ 3 వైపునకు దీని మీదుగానే వెళ్తుంటారు. దీంతో ప్రయాణికులు అక్కడి నుంచి పరుగులు తీశారు. కుంగిన సమయంలో వంతెన తాకడంతో కింద ఉన్న విద్యుత్ వైర్లు తెగిపోయాయి. విషయం తెలుసుకున్న రైల్వే సిబ్బంది వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. లేకుంటే పెద్ద ప్రమాదం జరిగి ఉండేది..అదే సమయంలో ప్లాట్‌ఫాంపైకి వస్తున్న వాస్కోడిగామా ఎక్స్‌ప్రెస్ పవర్ నిలిచిపోవడంతో అర్ధాంతరంగా నిలిచిపోయింది. ప్రస్తుతం ఈ ఫుట్ బ్రిడ్జిని మూసివేశారు..యుద్ధ ప్రాతిపదికన మరమత్తులు చేపట్టారు.



## కర్ణాటకలో భారీగా పట్టుబడిన బంగారం, నగదు..

లోక్‌సభ ఎన్నికలకు ముందు కర్ణాటక పోలీసులు భారీ స్థాయిలో బంగారం, నగదును స్వాధీనం చేసుకున్నారు. బళ్లారి పట్టణంలో దాడులు చేపట్టిన పోలీసులు.. ఓ నగల దుకాణం యజమాని నరేశ్ ఇంట్లో ఏకంగా రూ.5.60 కోట్ల నగదు పట్టుబడినట్లు పోలీసులు తెలిపారు. నగదుతోపాటు 3 కిలోల బంగారం, 103 కిలోల వెండి ఆభరణాలతోపాటు 68 వెండి కడ్డీలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. స్వాధీనం చేసుకున్న నగలు, బంగారం విలువ రూ.7.60 కోట్లకు పైనే ఉంటుందని పోలీసులు వెల్లడించారు. ఈ మేరకు దుకాణం యజమాని నరేశ్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు చెప్పారు. ఇదంతా హవాలా సొమ్ముగా పోలీసులు అనుమానిస్తున్నారు.



## దూసుకెళ్తున్న స్టాక్ మార్కెట్లు..

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు సోమవారం దూసుకెళ్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ఆశావహ సంకేతాలు, విదేశీ మదుపర్ల పెట్టుబడుల దన్నుతో మార్కెట్లు రాణిస్తున్నాయి. ఉదయమే సానుకూలంగా ప్రారంభమైన సూచీలు ఇంట్రాడేలో జీవనకాల గరిష్ఠాలను తాకాయి. సెన్సెక్స్-30 సూచీ దాదాపు 500 పాయింట్లు పుంజుకొని 74,751 పాయింట్ల వద్ద రికార్డు గరిష్ఠానికి చేరింది. నిఫ్టీ సైతం 22,658 దగ్గర తాజా రికార్డును నమోదు చేసింది. మధ్యాహ్నం 12:18 గంటల సమయంలో సెన్సెక్స్ 486 పాయింట్లు పుంజుకొని 74,739 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 143 పాయింట్లు లాభపడి 22,657 దగ్గర కొనసాగుతోంది. సెన్సెక్స్-30 సూచీలో మారుతీ, ఎం అండ్ ఎం, రిలయన్స్, యాక్సిస్ బ్యాంక్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఎల్ అండ్ టీ, ఇండస్‌ఇండ్ బ్యాంక్, పవర్‌గ్రిడ్, బజాజ్ ఫిన్‌సర్వ్, టాటా స్టీల్, టీసీఎస్ షేర్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి. నెస్లే ఇండియా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, విప్రో, సన్ ఫార్మా, బజాజ్ ఫైనాన్స్, ఎస్‌బీఐ షేర్లు నష్టాల్లో కొనసాగుతున్నాయి.



## చరిత్ర సృష్టించిన ముంబై ఇండియన్స్

ముంబై ఇండియన్స్ జట్టు చరిత్ర సృష్టించింది. టీ20 క్రికెట్‌లో 150 మ్యాచ్‌లు గెలిసిన జట్టుగా రికార్డు క్రియేట్ చేసింది. టీ20 ఫార్మాట్‌లో ఏ జట్టు కూడా అన్ని మ్యాచ్‌లు నెగ్గలేదు. ముంబైలో ఆదివారం ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో విజయం సాధించిన ముంబై ఇండియన్స్ జట్టు ఈ ఘనతను తన ఖాతాలో వేసుకున్నది. ఐపీఎల్‌తో పాటు ఛాంపియన్స్ లీగ్ టీ20 టోర్నీల్లో ఇప్పటి వరకు ముంబై ఇండియన్స్ జట్టు 273 మ్యాచ్‌లు ఆడింది. దాంట్లో 150 మ్యాచ్‌లను ఆ జట్టు నెగ్గగా, 117 మ్యాచుల్లో ఆ జట్టు ఓటమి పాలైంది. రెండు మ్యాచ్‌లకు ఫలితాలు దక్కలేదు. ఇక సూపర్ ఓవర్ వరకు వెళ్లిన మ్యాచుల్లో ముంబై జట్టు రెండు గెలవగా, మరో రెండింట్లో ఓటమి పాలైంది. చెన్నై సూపర్ కింగ్స్ జట్టు ఈ జాబితాలో రెండో స్థానంలో ఉన్నది. ఆ జట్టు ఇప్పటి వరకు 148 మ్యాచ్‌లను గెలుచుకున్నది. టీ20ల్లో సీఎస్కే 253 మ్యాచ్‌లు ఆడింది. దాంట్లో 148 గెలువగా, 101 మ్యాచుల్లో ఓడింది. రెండు మ్యాచుల్లో ఫలితాలు రాలేదు. సూపర్ ఓవర్‌లో చెన్నై జట్టు రెండు మ్యాచ్‌లను ఓడింది. ఓ రెగ్యులర్ మ్యాచ్ టై చేసుకున్నది.



## ఊరమాస్ గా పుష్ప 2 టీజర్..

పుష్ప ది రైజ్ మూవీ తో సూపర్ క్రేజ్ ను సొంతం చేసుకున్నారు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్. ఈ చిత్రం బన్నీ కెరీర్ లో కీలక మైలు రాయిగా నిలిచిపోయింది. ఈ చిత్రానికి సీక్వెల్ పుష్ప 2 ది రూల్ భారీ బడ్జెట్ తో తెరకెక్కుతోంది. ఐకాన్ స్టార్ సరసన హీరోయిన్ గా రష్మిక మందన్న నటిస్తుండగా, స్టార్ డైరెక్టర్ సుకుమార్ ఈ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే సినిమా నుండి రిలీజైన ప్రచార చిత్రాలకి ప్రేక్షకుల నుండి, అభిమానుల నుండి సెన్సేషన్ రెస్పాన్స్ వచ్చింది. నేడు బన్నీ పుట్టిన రోజు సందర్భంగా మేకర్స్ ఉదయం 11:07 గంటలకి టీజర్ ను రిలీజ్ చేశారు. టీజర్ పవర్ ఫుల్ గా అదరగొట్టింది. బన్నీ మేకోవర్ అద్దిరిపోయింది. విజువల్స్ చాలా బాగున్నాయి. దేవి శ్రీ ప్రసాద్ ఇచ్చిన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ సీన్ ను వేరే లెవెల్ లో చూపించింది. ఫ్యాన్స్ కి సిసలైన ట్రీట్ దక్కింది అని చెప్పాలి. జాతర సీక్వెన్స్ కి సంబందించిన కొన్ని కట్స్ ను టీజర్ గా రిలీజ్ చేశారు. ఎలాంటి డైలాగ్ లేకుండానే పవర్ ఫుల్ ఫైట్ తో ఉన్న టీజర్ ఆడియెన్స్ ను విశేషం గా ఆకట్టుకుంటుంది. టీజర్ తో సినిమా పై అంచనాలు మరింత పెరిగాయి అని చెప్పాలి. ఆగస్ట్ 15, 2024 న సినిమా రిలీజ్ కానున్నట్లు మరోసారి ప్రకటించారు మేకర్స్.

## కీసరలో యాక్సిడెంట్.. విద్యార్థి మృతి

HYD శివారు కీసర పరిధిలో కాసేపటి క్రితం రోడ్డు ప్రమాదం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. CMR కాలేజీలో బీటెక్ చదువుతున్న అనిరుధ్ క్రికెట్ ఆడేందుకు గ్రౌండ్ కు బుల్లెట్ బైక్ పై వెళుతున్నాడు. ఈ క్రమంలో కీసర పరిధి కుందన్ పల్లి-గోధుమకుంట మార్గంలో ఓ ఆటో ట్రాలీ, బుల్లెట్ బైక్ ఎదురెదురుగా వేగంగా ఢీకొన్నాయి. హెల్మెట్ లేకపోవడంతో అనిరుధ్ తల పగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని గాంధీకి తరలించారు.

# ఎమ్మెల్సీ కవితకు నో బెయిల్

మద్యం పాలసీ కేసులో ఎమ్మెల్సీ కవితకు మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు కోర్టు నిరాకరించింది. కవిత బెయిల్ పిటిషన్‌ను రౌస్ అవెన్యూ కోర్టు తోసిపుచ్చింది. ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న కవిత.. తన కుమారుడి పరీక్ష నేపథ్యంలో బెయిల్ ఇవ్వాలంటూ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ఈ నెల 4 ఇరుపక్షాల వాదనలు ముగియగా ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి కావేరీ భవేజా నేడు తీర్పును వెలువరించారు. కాగా, కవితకు కోర్టు విధించిన 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ మంగళవారంతో ముగియనుంది. నేడు మధ్యంతర బెయిల్ నిరాకరించడంతో రేపు మళ్లీ తీహార్ జైలు నుంచి కోర్టుకు హాజరుకానున్నారు. మరోవైపు కవిత సాధారణ బెయిల్ పిటిషన్‌పై ఈ నెల 20న వాదనలు వింటామని కోర్టు ఇప్పటికే స్పష్టంచేసిన విషయం తెలిసిందే.



ఢిల్లీ లిక్కర్ కేసులో అరెస్ట్ అయిన ఎమ్మెల్సీ కవిత మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై ఢిల్లీలో రౌస్ అవెన్యూ కోర్టులో ఈ నెల 4న వాడీవేడీగా వాదనలు జరిగాయి. కవిత తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ.. ఈడీ తరపున జోయబ్ హుసేన్ వాదనలు వినిపించారు. కుమారుడి పరీక్షల కారణంగా కవితకు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని ఒక పిటిషన్, ఈడీ కస్టడీ ముగియడంతో రెగ్యులర్ బెయిల్ ఇవ్వాలని రెండో పిటిషన్‌పై న్యాయస్థానం విచారించింది. కవిత కొడుక్కి పరీక్షలు ఉన్నాయని, అందుకే బెయిల్ మంజూరు చేయాలని కోరారు అభిషేక్ సింఘ్వీ. అయితే కవిత రెగ్యులర్ బెయిల్‌పై వాదనలను ఏప్రిల్ 20కు వాయిదా వేసింది. ఢిల్లీ లిక్కర్ కేసులో ప్రధాన సూత్రధారి ఎమ్మెల్సీ కవిత అని ఆరోపించారు ఈడీ తరపు న్యాయవాది. అవినీతి కార్యకలాపాల్లో ఉన్న మహిళకు బెయిల్ ఇవ్వకూడదన్నారు. ఒకవేళ బెయిల్ ఇస్తే ఆధారాలు, సాక్ష్యాలను ప్రభావితం చేస్తారని కోర్టుకు వివరించారు. లిక్కర్ స్కామ్‌ను ప్లాన్ చేసిందే కవిత అని.. ఫోన్ డేటా మొత్తాన్ని డిలీట్ చేశారని ఆరోపించారు. గతంలో విచారించిన సమయంలో మొత్తం 10 ఫోన్లను కవిత ఇచ్చారని.. కానీ అవి మొత్తం ఫార్మాట్ చేసినవేనని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. నోటీసులు ఇచ్చిన తరువాత 4 ఫోన్లను ఫార్మాట్ చేశారని ఆరోపించారు. ఈ క్రమంలో కవితకు వ్యతిరేకంగా సేకరించిన ఆధారాలను బయటకు చూపించలేమంటూ.. జడ్జి కావేరి బవేజాకు నేరుగా తీసుకెళ్లి చూపించారు ED జేడీ భానుప్రియ మీనా. పరీక్షలు ఉన్నాయని మధ్యంతర బెయిల్ అడుగుతున్నారు.. కానీ ఇప్పటికే కొన్ని పరీక్షలు అయిపోయాయని కోర్టుకు వివరించింది ఈడీ.

## హైదరాబాద్‌లో భారీగా బీర్‌ల అమ్మకాలు



ప్రతీ వేసవిలో సాధారణంగానే బీర్‌లకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. మద్యం ప్రియులు లిక్కర్‌కు బదులు చల్లటి బీర్‌ల వైపు మొగ్గు చూపుతారు. వేసవి తాపం నుంచి ఊరట పొందేందుకు వీటిని ఆశ్రయిస్తారు. పెరిగిన బీర్‌ల అమ్మకాల మేరకు ఉత్పత్తి మాత్రం పెరగడం లేదు. ప్రతిరోజూ గ్రేటర్‌లో 60 వేల నుంచి 80 వేల కేస్‌లకు పైగా బీర్‌లు అమ్ముడవుతున్నట్లు అంచనా. మరో 20 వేల కేస్‌లకు డిమాండ్ ఉన్నప్పటికీ కొరత దృష్ట్యా వినియోగదారులకు అందడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వంద కేస్‌ల కోసం ఆర్డర్ చేసే వైన్ షాపులకు 70 కేస్‌ల వరకే లభిస్తున్నట్లు వైన్‌షాపుల నిర్వాహకులు తెలిపారు. ఏప్రిల్ నెలలోనే కొరత ఇలా ఉంటే మే నెలంతా బీర్‌ల డిమాండ్‌ను ఎదుర్కోవడం ఎలా అని వ్యాపారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.



## వేశ్య పాత్రపై శోభిత క్రేజీ కామెంట్స్

తెలుగు అమ్మాయి 'శోభిత ధూళిపాళ' చాలా డిఫరెంట్ గా సినిమాలు చేస్తూ వస్తోంది. ముఖ్యంగా కొన్ని బోల్డ్ పాత్రలను కూడా చాలా బాగా పోషించింది. ఈ క్రమంలోనే ఆమెకు బాలీవుడ్ లో కూడా గుర్తింపు వచ్చింది. పైగా 'మంకీ మ్యాన్' అనే సినిమాతో హాలీవుడ్ లో కూడా ఎంట్రీ ఇచ్చింది ఈ తెలుగు బ్యూటీ. నటుడు దేవ్ పటేల్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన సినిమా ఇది. ఏప్రిల్ 5న అమెరికాలో విడుదలైంది ఈ సినిమా. ఇండియాలో మాత్రం ఏప్రిల్ 26న విడుదల కాబోతుంది. ఐతే, ఈ సినిమా ప్రమోషన్స్ లో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో శోభిత ఈ సినిమాలో తన పాత్ర పై ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది. ఇంతకీ, 'శోభిత ధూళిపాళ' ఏం మాట్లాడింది అంటే.. 'మంకీ మ్యాన్' సినిమాలో నేను సీత అనే వేశ్య పాత్ర పోషించాను. ఇలాంటి వైవిధ్యమైన పాత్రలో నటించినందుకు నాకు గౌరవంగా ఉంది. పైగా ఈ 'మంకీ మ్యాన్' సినిమాలో నా పాత్రకు అధిక ప్రాధాన్యం ఉంది. ప్రేక్షకుల ఆదరణ అందుకుంటుందని ఆశిస్తున్నాను' అని శోభిత ధూళిపాళ చెప్పుకొచ్చింది.



# నీటమునిగిన పడవ.. 90 మందికిపైగా మృతి

చేపల వేట కోసం సముద్రంలోకి వెళ్లి ప్రమాదవశాత్తు పడవ మునగడంతో దాదాపు 90 మందికి పైగా దుర్మరణం చెందారు. ఈ దుర్ఘటన ఆఫ్రికా దేశమైన మొజాంబిక్‌లో చోటుచేసుకుంది. ప్రమాదం జరిగిన సమయంలో పడవలో 130 మంది ఉన్నట్లు సమాచారం. సామర్థ్యానికి మించి పడవలో ప్రయాణించడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు స్థానిక అధికార యంత్రాంగం తెలిపింది. మృతుల్లో ఎక్కువ మంది చిన్న పిల్లలు ఉన్నట్టు స్థానిక అధికారులు వెల్లడించారు. పడవ మునిగిన విషయం తెలిసిన వెంటనే అధికారులు ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కలరా వ్యాప్తి అంటూ వదంతులు రావడంతో ప్రధాన ప్రాంతాల నుంచి ప్రజలు తప్పించుకొని దీవుల్లోకి వెళ్తుండగా ఈ పడవ మునిగిందని నాంపుల ప్రావిన్స్ సెక్రటరీ జైమ్ నెటో చెప్పారు. ప్రపంచంలోని అత్యంత పేద దేశాలలో ఒకటైన మొజాంబిక్‌లో గత అక్టోబర్ నుంచి ఇప్పటి వరకు 15,000 కలరా కేసులు నమోదయ్యాయి. మరో వైపు 32 మంది చనిపోయినట్లు అక్కడి ప్రభుత్వ నివేదికలు పేర్కొన్నాయి.



# రాయ్‌బరేలీ నుంచి ప్రియాంకా గాంధీ?

కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ తర్వాత యూపీలోని రాయ్‌బరేలీ ఎవరిది? ఈ ప్రశ్నకు కాంగ్రెస్ హైకమాండ్ త్వరలోనే జవాబు చెప్పనుంది. తాజాగా రాయ్‌బరేలీ ఎన్నికల బరిలో ప్రియాంక ప్రవేశానికి సంబంధించిన సూచనలు హై కమాండ్ నుంచి జిల్లా కార్యనిర్వాహకవర్గానికి అందిందనట్లు సమాచారం. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడనుందట. ప్రియాంకా గాంధీ రాయ్‌బరేలీ నుంచి ఎన్నికల్లో పోటీ చేయాలని కోరేందుకు జిల్లా కమిటీ అధికారులు ఫిబ్రవరిలో ఆమెను కలుసుకున్నారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు రాయ్‌బరేలీ సీటు ఎంతో కీలకం. సమాజ్‌వాదీతో పొత్తు కారణంగా రాష్ట్రంలో కాంగ్రెస్‌కు 17 సీట్లు దక్కాయి. ప్రియాంక గాంధీ రాయ్‌బరేలీ నుంచి ప్రచారాన్ని ప్రారంభిస్తే రాష్ట్రంలోని అన్ని లోక్‌సభ స్థానాలకు మంచి సందేశం అందుతుందని, అది భారత కూటమికి మేలు చేస్తుందని కాంగ్రెస్ థింక్ ట్యాంక్ నమ్ముతోంది.



# బ్రెజిల్ సుప్రీంకోర్టు వర్సెస్ ఎలన్ మస్క్

బ్రెజిల్ సుప్రీంకోర్టు జడ్జి, బిలియనీర్ ఎలన్ మస్క్ మధ్య వార్ నడుస్తోంది. కొన్ని అకౌంట్లను బ్లాక్ చేయాలని ఇటీవల బ్రెజిల్ సుప్రీం జడ్జి ఆదేశించారు. ఆ కేసులో దర్యాప్తునకు కూడా ఆ జడ్జి ఆదేశించారు. అయితే ఆ ఎక్స్ అకౌంట్లను రియాక్టివేట్ చేయనున్నట్లు మస్క్ ప్రకటించారు. దీంతో ఆ ఇద్దరి మధ్య ఫైట్ మొదలైంది. భావస్వేచ్ఛను అడ్డుకుంటున్నారని మస్క్ ఆరోపించారు. దేశంలోని కొన్ని ఎక్స్ అకౌంట్లను బ్లాక్ చేయాలని జడ్జి అలెగ్జాండ్రే డీమోరల్స్ ఆదేశించారు. అయితే ఆ ఆదేశాలు రాజ్యాంగ వ్యతిరేకంగా ఉన్నాయని, ఆ అకౌంట్లపై పెట్టిన ఆంక్షలను ఎత్తివేస్తానని, జడ్జి మోరేల్స్ రాజీనామా చేయాలని మస్క్ డిమాండ్ చేశారు. అయితే ఇంతకీ ఏయే ఎక్స్ అకౌంట్లను బ్లాక్ చేశారన్న అంశాన్ని ఇప్పటి వరకు బ్రెజిల్ అధికారులు కానీ, ప్రభుత్వ అధికారులు కానీ వెల్లడించలేదు. మాజీ అధ్యక్షుడు జెయిర్ బొల్సనారో పరిపాలన సమయంలో.. కొందరు ఆ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేశారు. బొల్సనారోపై జరిగిన సైనిక కుట్ర కేసును కూడా ఆయన విచారిస్తున్నారు. అయితే జడ్జి మోరేల్స్ పదేపదే రాజ్యాంగాన్ని విస్మరిస్తున్నారని, దేశ ప్రజలను కూడా మోసం చేస్తున్నారని మస్క్ తన ఎక్స్ పోస్టులో ఆరోపించారు.

## బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు

# రహీల్ అరెస్ట్

బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు రహీల్‌ను పోలీసులు ఎట్టకేలకు అరెస్ట్ చేశారు. ప్రగతి భవన్ వద్ద కారు ప్రమాదం కేసులో రహీల్ నిందితుడిగా ఉన్న విషయం తెలిసిందే. రహీల్ కోసం గత కొంత కాలంగా పోలీసులు గాలిస్తున్నారు. అరెస్ట్ అనంతరం రహీల్‌ను పోలీసులు.. జడ్జీ ఎదుట హాజరుపరిచారు. దీంతో, ఈనెల 22 వరకు రహీల్‌కు రిమాండ్ విధించారు. అనంతరం, రహేల్‌ను చంచల్‌గూడ జైలుకు తరలించారు. కాగా, ప్రగతి భవన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం తర్వాత రహీల్ దుబాయ్‌కు పారిపోయాడు. దీంతో, రహీల్‌కు ఇప్పటికే పోలీసులు లుక్ అవుట్ నోటీసులు కూడా జారీ చేశారు. ఈ క్రమంలో ఈరోజు రహీల్ దుబాయ్ నుంచి హైదరాబాద్‌కు తిరిగి వస్తుండగా పంజాగుట్ట పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. అయితే, ప్రగతి భవన్ వద్ద జరిగిన ప్రమాదంలో రహీల్‌ను తప్పించేందుకు తన బదులు ఇంట్లో పనిచేసే మరొకరు కారు నడిపినట్టు చూపించారు నిందితులు. కానీ, అసలు నిందితుడు రహేల్‌గానే పోలీసులు గుర్తించారు.

అసలేం జరిగిందంటే..

డిసెంబర్ 23 2023వ తేదీన తెల్లవారుజామున మూడు గంటల సమయంలో హైదరాబాద్‌లోని ప్రగతి భవన్(ప్రస్తుత ప్రజా భవన్) వద్ద ఓ కారు బీభత్సం సృష్టించింది. ప్రగతి భవన్ వద్ద ఉన్న బారికేడ్లపైకి దూసుకెళ్లి వాటిని ధ్వంసం చేసింది. అప్రమత్తమైన పోలీసులు అక్కడికి చేరుకుని వాహనంలో ఉన్న వారిని అదుపులోకి తీసుకుని నిందితులను పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మాజీ ఎమ్మెల్యే షకిల్ కుమారుడు రాహీల్ ఈ విధ్వంసం సృష్టించినట్లు తెలిసింది. అయితే పోలీస్ స్టేషన్ నుంచి అతడు తప్పించుకోవడంతో నిందితుడు కావాలనే తప్పిపోయాడా ఎవరైనా తప్పించారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించి అసలు నిందితుడు రహేల్ అని తేల్చారు.




మరో కేసులో రహేల్..

జూబ్లీహిల్స్‌లో రెండు సంవత్సరాల క్రితం జరిగిన ప్రమాదం కేసులో కీలక ట్విస్ట్ చోటుచేసుకుంది. ఈ ప్రమాదం సమయంలో షకీల్ కొడుకే రహీల్ కారు నడిపినట్టు పోలీసులు గుర్తించారు. దీంతో, ఈ కేసుపై మళ్లీ దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్-45లో 2022న మార్చి 17న జరిగిన రోడ్డు ప్రమాదంలో 2 నెలల చిన్నారి మృతి చెందాడు. ఈ కేసులో దర్యాప్తును పోలీసులు తిరిగి ప్రారంభించడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఆ రోజు దుర్గం చెరువు నుంచి జూబ్లీహిల్స్ వైపు వచ్చిన మహీంద్రా థార్ వాహనం రాత్రి ఎనిమిది గంటలకు రోడ్డు దాటుతున్న యాచకులను ఢీకొట్టింది. ముగ్గురు మహిళలకు గాయాలు కాగా రెండు నెలల బాలుడు దుర్మరణం చెందాడు. కారులోని యువకులు పారిపోయినప్పటికీ వాహనంపై ఎమ్మెల్యే స్టిక్కర్ ఉండటంతో షకీల్ వాహనంగా తేలింది. అయితే అందులో తన కుమారుడు లేడని షకీల్ ప్రకటన ఇచ్చారు. మరోవైపు అఫ్రాన్ అనే మరో యువకుడు తానే కారు నడిపినట్లు అంగీకరించి లొంగిపోయాడు. స్టీరింగ్‌పై వేలిముద్రలు అఫ్రాన్‌వేనని అప్పట్లో పోలీసులు ప్రకటించారు. బాధితుల వాంగ్మూలాల సేకరణ సహా, సీసీటీవీ దృశ్యాల ఆధారంగా మాజ్ అనే మరో యువకుడితో పాటు కారులో రాహిల్ ఉన్నట్లు తేలడంతో దర్యాప్తు మలుపు తిరిగింది. తాజాగా దర్యాప్తులో ఆరోజు కారు నడిపింది రహీల్ అని పోలీసులు గుర్తించారు. మరోవైపు.. అప్పట్లో 304-B సెక్షన్ చేర్చకపోవడంతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ గురించి ఆరా తీయకపోవడం లాంటి కారణాలను విశ్లేషిస్తున్నారు. మహారాష్ట్రకు వెళ్లి బాధితులను నగరానికి తీసుకొచ్చి వారితోపాటు మరికొందరి వాంగ్మూలాలు సేకరించారు. ఘటన జరిగిన రోజు డ్రైవింగ్ సీట్ నుంచి లావుగా ఉన్న యువకుడు పారిపోయాడంటూ బాధితులు వాంగ్మూలం ఇచ్చినట్లు సమాచారం. దీన్నిబట్టి రాహీల్ డ్రైవింగ్ సీట్లో ఉన్నట్లు పోలీసులు నమ్ముతున్నారు.




# హైదరాబాద్‌లో దారుణం..

## మర్డర్ చేసి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్..!

హైదరాబాద్ లో పాతకక్షలే ఓ యువకుడి ప్రాణం తీశాయి. ఆ యువకుడిపై 10 నుంచి 11 కత్తితో పొడవడమే కాకుండా.. అతనిపై బండరాయితో తలపై మోది హత్య చేశారు. అంతటితో ఆగక ఆ మర్డర్ చేసిన కత్తి, రక్తంతో వున్న చేతితో వున్న వీడియోను ఇన్‌స్టాగ్రామ్ లో హత్య చేసామని పోస్ట్ చేసిన ఘటన నగరంలో కలకలం రేపింది. బాచుపల్లి పియస్ పరిధి ప్రగతినగర్ లో అర్ధరాత్రి ఓ యువకుడి మర్డర్ జరిగింది. పాత కక్షలే కారణంగా హత్య జరిగినట్లు పోలీసులు, స్థానికులు భావిస్తున్నారు. మృతుడు అలియాస్ సిద్దు గా పోలీసులు గుర్తించారు. ప్రగతినగర్ లోని బతుకమ్మకుంట వద్ద ఓ బిల్డింగ్ లో తన తల్లి, మామతో కలిసి సిద్దు నివాసం ఉంటున్నాడు. గత దసరా పండగ రోజు బోరబండలో జరిగిన అరుణ్ హత్యలో సిద్దు A3 నేరస్తుడుగా ఉన్నాడు. అయితే రెండు నెలల క్రితం సిద్దు జైల్ నుండి రిలీజ్ అయ్యాడు. అర్ధరాత్రి సుమారు 3.30 సమయంలో గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు సిద్దు ఇంటికి వెళ్లారు. గాఢనిద్రలో వున్న సిద్దును తీసుకుని బయట పని వుందని తీసుకుని తీసుకుని వచ్చారు అనంతరం అతనిపై ముగ్గరు మూకుమ్మడిగా దాడి చేశారు. వారి వెంట తెచ్చుకున్న కత్తితో సిద్దును కిరాతకంగా హత్య చేసారు. సిద్దు కేకలు వేస్తున్నా పట్టించుకోకుండా.. శరీరంపై 11 కత్తిపోట్లతో విచక్షణారహితంగా పొడిచారు. సిద్దు కిందపడిపోవడంతో అతనిపై బండరాయితో తలపై మోది హత్య చేసారు. అనంతరం మర్డర్ చేసామని ఇన్‌స్టాగ్రామ్ లో పోస్ట్ చేసారు. దీంతో సిద్దు హత్య నగరంలో వైరల్ గా మారింది. ఆరీల్ లో (ధగడ్ బోల్ రే.. సిద్దు బోల్ రే ) అంటూ అందులో రాసుకొచ్చారు. ఆ రాతలతో సాంగ్ క్రియేట్ చేసి స్టేటస్ పెట్టారు. అందులో వారు పొడిచిన కత్తి, రక్తంతో వున్న చేతులు, ఒక బైక్ పై ఇద్దరు కూర్చుని దారిలో వెళ్లడమే కాకుండా.. మరోచోటకు వెళ్లి ఆ కత్తిని మరొకతనికి చూపించడమే కాకుండా.. ఆపాటలకు స్టెప్పులేస్తూ నాలుక మడత పెడుతూ డాన్స్ చేసిన వీడియో పోస్ట్ చేశారు.



# నేను గొడ్డు మాంసం తినను.. కాంగ్రెస్ నేతకు కంగనా స్ట్రాంగ్ కౌంటర్..

హిమాచల్ ప్రదేశ్‌లో లోక్ సభ ఎన్నికల ప్రచారం హీటెక్కుతోంది. మండి లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా బాలీవుడ్ నటి కంగనా రనౌత్ పోటీ చేస్తున్నారు. ఆమెకు ప్రత్యర్థిగా కాంగ్రెస్ తరపున విజయ్ వాడెట్టివార్ పోటీలో ఉన్నారు. ఈ క్రమంలో విజయ్ పై కంగన తీవ్ర స్థాయిలో ఫైర్ అయ్యారు. తాను గొడ్డు మాంసం గానీ ఎలాంటి రెడ్ మీట్ వంటివి తిననని వెల్లడించారు. తనపై నిరాధారమైన ఆరోపణలు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. దశాబ్దాలుగా తాను యోగా, ఆయుర్వేద విధానాన్ని పాటిస్తున్నానన్నారు. తన ప్రతిష్టను దెబ్బతీసేందుకు ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నరాని ఆక్షేపించారు. తాను గర్వించదగిన హిందువుననే విషయం ప్రజలందరికీ తెలిసిందేనని స్పష్టం చేశారు. తాను బీఫ్ తింటానని కంగనా రనౌత్ ఇటీవల చెప్పారని కాంగ్రెస్ నేత విజయ్ వాడెట్టివార్ ఆరోపించారు. గొడ్డు మాంసం ఇష్టమని ఎక్స్‌లో రాసిన కంగనా రనౌత్‌కు బిజెపి టికెట్ ఇచ్చిందని ఆరోపించారు. వాడెట్టివార్ వ్యాఖ్యపై బీజేపీ అధికార ప్రతినిధి కేశవ్ ఉపాధ్యాయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి వ్యాఖ్యలు కాంగ్రెస్ నీచ సంస్కృతికి నిదర్శనమని మండిపడ్డారు. వ్యక్తిగత ఆరోపణలు చేయడం మాని ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని హితవు పలికారు.

# తెలంగాణ మంత్రి పొంగులేటి కుమారుడికి కస్టమ్స్ సమన్లు

తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కుమారుడు హర్షారెడ్డికి చెన్నై కస్టమ్స్ విభాగం సమన్లు జారీచేసింది. ఆయన డైరెక్టర్‌గా ఉన్న హైదరాబాద్‌లోని కంపెనీకి వాటిని పంపి విచారణకు హాజరవ్వాలని పేర్కొంది. ఆయన విదేశాల నుంచి అత్యంత ఖరీదైన చేతి గడియారాలను తెప్పించినట్లు ఆరోపించింది. ఈ నెల 4న తమ ఎదుట హాజరవ్వాలని సమన్లు జారీ చేయగా.. తాను డెంగీ జ్వరంతో బాధపడుతున్నందున రాలేకపోతున్నట్లు ఆయన తెలియజేశారు. ఈనెల 27 తర్వాత హాజరయ్యేందుకు సుముఖత వ్యక్తం చేశారు. పీటీఐ వార్తా సంస్థ ఈ వివరాలను వెల్లడించింది. హాంకాంగ్‌లో ఉంటున్న భారతీయుడు, లగ్జరీ వాచ్‌ల డీలర్ ముహమ్మద్ ఫహేరుద్దీన్ ముబీన్ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 5న అలోకం నవీన్‌కుమార్ సింగపూర్-చెన్నై విమానంలో గడియారాలను తెచ్చాడు. అతడిపై స్మగ్లింగ్ కేసు నమోదైంది. ఆ వాచీల విలువ రూ.1.73 కోట్లు. వాటిని హర్షారెడ్డి కోసం తెచ్చినట్లు కస్టమ్స్ ఆరోపిస్తోంది. తాను హర్షారెడ్డికి, ముబీన్‌కు మధ్యవర్తిగా ఉన్నట్లు నవీన్‌కుమార్ తెలిపాడు. క్రిప్టో కరెన్సీ ద్వారా హర్షారెడ్డి ఆ డబ్బులు బదలాయించినట్లు విచారణలో బయటపడింది. చెన్నైలోని అలందూరు కోర్టు ఏప్రిల్ 1న ఇచ్చిన ఉత్తర్వుల మేరకు నవీన్‌కుమార్‌ను అరెస్టు చేయడంతో పాటు హర్షారెడ్డిని విచారించేందుకు కస్టమ్స్ అధికారులు సిద్ధమయ్యారు. హర్షారెడ్డి పీటీఐతో మాట్లాడుతూ.. కస్టమ్స్ ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని అన్నారు.




# మంచు కరిగి నిండిన నదులు.. రష్యాను ముంచెత్తిన ఆకస్మిక వరదలు

రష్యాను ఆకస్మిక వరదలు ముంచెత్తాయి. వేగంగా కరుగుతున్న మంచు యూరప్‌లోని అతిపెద్ద నదుల్లో కొన్నింటిని ముంచెత్తింది. దీంతో ఉరల్ పర్వతాల్లో రికార్డు స్థాయిలో నీటి స్థాయిలు పెరిగాయి. నీటి ఉద్ధృతికి మాస్కోకు తూర్పున 1,800 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఓర్స్క్ నగరంలోని ఆనకట్ట ఒక్కసారిగా తెగిపోయింది. దీంతో సమీప గ్రామాలను వరద ముంచెత్తింది. భారీ మొత్తంలో నీరు సమీపంలోని గ్రామాల్లోకి ప్రవేశించింది. సుమారు 10వేలకు పైగా ఇళ్లు వరద ముంపునకు గురయ్యాయి. సైబీరియా, వోల్గా, రష్యాలోని మధ్య ప్రాంతాల్లో కూడా వరదలు సంభవించాయి. ఉష్ణోగ్రతలు అధికంగా ఉండటంతో ఆ వేడికి మంచు కరగడంతో ఈ విపత్తు సంభవించినట్లు రష్యా అత్యవసర మంత్రిత్వ శాఖ తెలిపింది. సుమారు 39 ప్రాంతాల్లో 10,400 కంటే ఎక్కువ ఇళ్లు వరద ముంపునకు గురైనట్లు వెల్లడించింది. మరోవైపు అప్రమత్తమైన అధికారులు వరద ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలను సుక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.



# మరో ఆప్ ఎమ్మెల్యేకు ఈడీ సమన్లు..

ఢిల్లీ మద్యం కుభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దూకుడు పెంచింది. ఈ కేసుకు సంబంధం ఉన్న ఆప్ నేతలకు వరుసగా నోటీసులు ఇస్తోంది. తాజాగా ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన మరో ఎమ్మెల్యేకు ఈడీ నోటీసులు పంపింది. ఎమ్మెల్యే దుర్గేష్ పాఠక్‌కు ఈడీ అధికారులు సోమవారం సమన్లు పంపారు. తమ ముందు విచారణకు హాజరు కావాలని సమన్లలో పేర్కొన్నారు. ఈ మధ్యాహ్నం ఆయన ఈడీ ప్రధాన కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. 'ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఎమ్మెల్యే పాఠక్‌కు ఈడీ అధికారులు సమన్లు పంపారు. గోవా అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా నగదు చెల్లింపులకు సంబంధించి పాఠక్ పేరు ప్రస్తావనలోకి వచ్చింది. ఆయన ఇవాళ మధ్యాహ్నం ఈడీ ముందు విచారణకు హాజరయ్యే అవకాశం ఉంది' అని పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ అధికారి తెలిపినట్లు జాతీయ మీడియా వెల్లడించింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం నిబంధనల ప్రకారం బిభవ్ కుమార్ వాంగ్మూలాన్ని నమోదు చేసినట్లు ఈడీ అధికారులు తెలిపారు.కాగా, మద్యం కుంభకోణం కేసులో ఇప్పటి వరకూ నలుగురు ఆప్ నేతలు జైలుకు వెళ్లిన విషయం తెలిసిందే. ఆప్ కన్వీనర్, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ సహా, ఆప్ ఎంపీ సంజయ్ సింగ్, మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా, మాజీ మంత్రి సత్యేంద్ర జైన్‌ను కేంద్ర దర్యాప్తు సంస్థలు పలు కేసుల్లో అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. వాళ్లు కూడా ప్రస్తుతం తీహార్ జైలులోనే ఉన్న విషయం తెలిసిందే.

